**కథ**

అనంతలక్ష్మికి చిన్నప్పటినుంచీ ఓ కోరిక ఉండేది. తను బాగా చదువుకుని ఓ పేద్ద ఉద్యోగం చేయాలని. వాళ్ళు ఉండేది చిన్నరకం బస్తీ కనుక ఆమె చదువుకి ఆటంకం కలుగలేదు టెన్త్‌వరకూను. ఆ తరువాతే తన చదువుకి ఆటంకం మొదలైంది నాయనమ్మ రూపంలో. ''నేను బ్రతికుండగానే నీ కూతురి పెళ్ళి చేయరా కావుడూ. అది చూసి హాయిగా కళ్ళు మూస్తాను'' అనే డైలాగుతో కొడుకుని, కోడలిని ఊదరగొట్టేసేది.

''పెళ్ళంటే? ఏ బొమ్మల పెళ్ళో అనుకుంటున్నది కాబోలు మా అమ్మ. బోలెడంత కట్నం ఇవ్వాలి. లాంఛనాలు జరిపించాలి. అల్లుడికి పెట్టుపోతలు, అత్తవారికి కానుకలు అంటూ బోలెడంత తతంగం వుంటుంది. వీటి ఖర్చులకు వేలకు వేలు డబ్బు కావాలి'' అని భార్య దగ్గర చిరాకు పడే కామేశం, పైకి నవ్వేస్తూ ''నేనూ ఆ ప్రయత్నంలోనే వున్నానమ్మా'' అని తల్లిని సవరించేవాడు.

తండ్రి, నాయనమ్మల సంభాషణ విన్న అనంతలక్ష్మి మనసులోనే పళ్ళు నూరుకుంది. పైకి సౌమ్యత నటిస్తూ పెళ్ళి ''పెళ్ళి కుదిరే వరకు గోళ్ళు గిల్లుకుంటూ ఖాళీగా కూర్చోలేను నానమ్మా, అప్పటివరకూ కాలక్షేపంగా చదువుకుంటాను'' అని నాయనమ్మ దగ్గర గారాబాలు పోయింది.

''ఇప్పుడు చదువు అంటావు ఆనక ఉద్యోగం అంటావు. వయసు ముదిరిపోతే పెళ్ళి కాదు'' అడ్డుపుల్లవేసింది నాయనమ్మ.

''ఛస్తే అనను. మీరు అబ్బాయిని చూడండి, ఈలోపుగా నేను చదువుకుంటూ నా సరదాన్ని తీర్చుకుంటాను'' అంది.

''అబ్బాయిని చూసాను. మన అమ్మాయిని చూట్టానికి వస్తున్నారు'' అని తల్లి దగ్గర చెప్పేవాడు కొడుకు. కానీ వస్తానన్న పెళ్ళివారు మాత్రం ఎన్నిరోజులైనా వచ్చేవారు కాదు.

# అనంతలక్ష్మి కథ



**ఎం. ప్రభావతీ దేవి**

అనంతలక్ష్మి చదువు మాత్రం డిగ్రీ వరకూ నిరాఘాటంగా సాగిపోయింది. 'అమ్మయ్య ఓ కోరిక తీరింది, ఇంక ఉద్యోగం చూసుకోవాలి' అనుకుంది సంతృప్తిగా. మనవరాలి పెళ్లి చూడకుండానే 'హరీ' అంది నాయనమ్మ.

'ఇప్పుడు ఉద్యోగం చేస్తానంటుంది తరువాత ఎవరినో ప్రేమించాను, అతన్ని తప్ప మరొకరిని చేసుకోను' అని కూతురెక్కడ పేచీ పెడుతుందో అనే భయంతో ముందు జాగ్రత్తగా తన బాధ్యత, తల్లి కోరిక తీర్చాలనే పట్టుదలతో అన్నివిధాలా అనుకూలమైన సంబంధమే చూసి పెళ్ళి ఖాయం చేసేడు.

''నీ భర్త ఇష్టపడితే నువ్వు కూడా ఉద్యోగం చేద్దువుగాని లేమ్మా, ముందు నాన్నగారి మాట విను'' అని తల్లి బ్రతిమాలింది.

ఇకవాళ్ళ మనసుల్ని నొప్పించలేక బుద్ధిగా పెళ్ళిపీటల మీద కూర్చుంది అనంతలక్ష్మి. మొదటిరాత్రే తన మనసులో మాట వెల్లడించింది భర్త దగ్గర.

''అలాగే నీ యిష్టప్రకారమే ఉద్యోగం చేద్దువుగానిలే'' అన్నాడు తను. ఉద్యోగం చేయాలనే ఉబలాటంతో

పెళ్ళయిన నెలకే భర్త వెంట సిటీకి బైలుదేరిందామె.కాపురానికొచ్చి అప్పుడే ఏడాది కావస్తున్నది కానీ ఉద్యోగం మాత్రం అనంతలక్ష్మి దరిదాపుల్లోకి కూడా రాలేదు.

''ఇంట్లో ఒక్కర్తినీ కూర్చొని బోరు కొడ్తున్నది. నా ఉద్యోగం విషయం ఏం చేసారు?'' అని రోజా భర్తని అడుగుతూనే వుంది.

''నేను ఆ ప్రయత్నంలోనే వున్నాను. నువ్వు కూడా ఏదైనా జాబ్ చేస్తుంటే ఇద్దరి జీతాలతో ఇంట్లోకి కావాల్సినవి ఎన్నో అమర్చుకోవచ్చుకదా'' అని భార్యని ఓదారుస్తున్నాడు అతను.

అనంతలక్ష్మి వాళ్ళు వుంటున్న వీధిలోనే ఎదురింట్లో ఓ దంపతులుంటున్నారు. వాళ్లిద్దరూ ఉద్యోగస్తులే. వాళ్ళ వయసు ఏభైలోపుగా వుంటుందేమో. ఉదయం ఇద్దరూ చెరో స్కూటరు మీద వెళ్ళిపోతారు. తిరిగి సాయంకాలం ఇద్దరూ జంటగా వస్తారు. వాళ్ళలా తనూ, భర్త కలిసి ఎప్పుడు వెళ్తుందో ఆఫీసుకి అని ఆలోచిస్తూ వుంటుంది.

ఓరోజు మధ్యాహ్నం ఏమీ తోచక గుమ్మంలో నిల్చుని వుంది అనంతలక్ష్మి. ''పాలు వుంటే ఓ గ్లాసుడు ఇస్తారా? సాయంత్రం తెప్పించి ఇస్తాను'' అంటూ వచ్చింది ఎదిరింట్లో వుంటున్న ఆమె.

''తల పగిలిపోతున్నది టీ కాచుకుందామని చూస్తే పాలు విరిగిపోయాయి'' అంది తను వచ్చిన కారణం వివరిస్తూ.

''లోపలికి రండి ముందు. బయటే నిల్చున్నారు'' సంతోషంతో ఆమెను లోపలికి ఆహ్వానించింది అనంతలక్ష్మి.

ఆమె చనువుగా లోపలికి వచ్చి ఆ పోర్షనంతా కలయతిరుగుతూ ''చాలా నీటుగా సర్దుకున్నారండీ గదిని'' అని మెచ్చుకుంది.

''ఇవన్నీ మీరు తయారుచేసినవేనా? చాలా బాగున్నాయండి, మీలో చాలా 'ఆర్ట్' వుంది. ఇవన్నీ తయారుచేయడానికి మీకు బోలెడంత టైము వుంటుంది కదూ. నాకు సరదా వున్నా వంట చేసుకోవడానికే టైము చాలదు. హడావిడిగా వండుకుని బాక్సులో పెట్టుకుని ఆఫీసుకి పరుగెట్టడం..మావి యాంత్రికమైన జీవితాలు'' ఆవిడ నిర్లిప్తంగా అంది.

''ఎవరినైనా దగ్గర వాళ్ళను తెచ్చి సహాయంగా పెట్టుకోవలసింది'' సలహా యిచ్చింది అనంతలక్ష్మి.

''ఈ వూరి వాళ్ళను పెట్టుకుంటే, ఆనుపాను చూసి మనం లేనప్పుడు ఇల్లు దోచేస్తారు. బంధువులను దగ్గర పెట్టుకుంటే వాళ్ళు వంటరిగా వుండలేకపోతున్నాము, ఏమీ తోచడం లేదు. మాట్లాడే వాళ్ళే వుండరు. ఒక్కళ్ళము ఉండలేకపోతున్నాము అంటూ మూడో రోజుకే బండి ఎక్కేస్తున్నారు. దగ్గర బంధువులు వచ్చినా 'మీరు ఆఫీసుకి వెళ్ళిపోతారు. నాలుగ్గోడల మధ్య కూర్చుని వంటరిగా గడపలేకపోతున్నాము' అని ఒకటి రెండు రోజులకే మొహం మొత్తి వెళ్ళిపోతుంటారు. పోనీ ఉద్యోగం మానేద్దామా అంటే ఇంట్లో ఖాళీగా కూర్చోలేము, స్వంత సంపాదనకలవాటు పడ్డాము. ఏది కావాలన్నా శ్రీవారి అనుగ్రహంతో కొనుక్కోవాలి. అదీ ఓ కారణంగా చేసే ఉద్యోగం మానలేము.

మొదట సరదాకి కాలక్షేపానికి ఉద్యోగంలో చేరతాము, ఆ తరువాత వచ్చిపడే అవసరాలతో ఉద్యోగం మానాలనుకున్నా మానలేము. ఆడబడుచుల చదువులు, పెళ్ళిళ్ళు, మరుదుల కాలేజీ ఫీజులు, వాళ్ళ పెళ్ళిళ్ళు, పురుళ్ళు, పుణ్యాలు, వచ్చీపోయే చుట్టాలతో పెరిగే ఖర్చులతో విధిగా ఉద్యోగం చేయక తప్పదు. ఏవిటో మా జీవితాలు'' ఆవిడ తన మనసులో బాధని వ్యక్తం చేస్తుంటే ఆశ్చర్యపడుతూ వింది అనంతలక్ష్మి.

''మీరు కాసిని పాలు ఇచ్చినా సరే టీ పెట్టి ఇచ్చినా సరే త్రాగేసి వెళ్ళి పడుకుంటాను'' ఆమె మొహమాట పడకుండా అడుగుతుంటే తన మతిమరుపునకు నొచ్చుకుంటూ క్షణంలో పెట్టిస్తాను టీ అని కిచెన్‌లోకి పరుగుపెట్టింది అనంతలక్ష్మి.

ఒక ప్లేటులో మైసూరుపాకు, మరో ప్లేటులో కారబ్బూంది పెట్టి గ్లాసులో మంచినీళ్ళు పెట్టి తీసుకొండి అని ఆమె ముందు పెట్టింది.

మొహమాటం పడకుండా ప్లేటు ఖాళీ చేసి ''చాలా బాగున్నాయండి మీరు చేసినవేనా!'' అంది నవ్వుతూ.

అవునన్నట్లు తల ఊపింది అనంతలక్ష్మి. కానీ మనసులో మాత్రం చాలా గర్వించింది తను చేసిన పిండివంటల్ని ఆమె మెచ్చుకున్నందుకు.

''మీవారు చాలా అదృష్టవంతులు. రుచికరమైన వంట చేసే భార్య దొరికినందుకు. మావారు ఇప్పటికీ దెప్పుతుంటారు నీకు రుచిగా వంట చేయడమే రాదు అని'' ఆవిడ గలగలా నవ్వింది.

అనంతలక్ష్మి రెండు కప్పులతో 'టీ' తెచ్చి ఒకటి ఆమెకిచ్చి తను త్రాగుతూ ఆమె ఎదురుగా మరో కుర్చీలో కూర్చుంది.

''మీరు మాత్రం ఉద్యోగం కోసం ప్రయత్నించకండి. మొదట సరదాగా వుంటుంది. తరువాత బాధ్యతలు మాననివ్వవు. చివరకు ఉద్యోగం మానలేని స్థితికి వెళ్తాము. మీరు చూడండి. నిశ్చింతగా కూర్చుని నాతో మాట్లాడేరు. టీ, టిఫిన్ పెట్టారు. అదే జాబ్ చేస్తుంటారునుకోండి. ఇంక ఖాళీ సమయమే దొరకదు మీకు'' ఆవిడ చెప్పడం ఆపి లేచింది వెళ్తానంటూ. ''మర్చిపోయాను నా పేరు చెప్పలేదు కదూ మీకు. శారద. అప్పుడప్పుడూ వస్తుంటానులెండి. మరోమాట! మీరు నాకు చాలా నచ్చేరు. మీరు చేసిన ఆర్టికల్స్ బాగా నచ్చేయి. మీ చేతి వంట ఇంకా బాగా నచ్చింది'' కాంప్లిమెంటు ఇచ్చి మరీ వెళ్ళిపోయిందామె.

ఆమె వెళ్ళిపోయినా ఆమె మాటలే చెవిలో రింగుమంటున్నాయి అనంతలక్ష్మిని ఆలోచనలో పడేస్తూ.

ఆమె చెప్పినట్లు తను ఉద్యోగం చేస్తూ ఆఫీసుకి ఇంటికి హడావిడిగా తిరుగుతూ ఇంటిని ఇంత నీట్‌గా వుంచగలదా, రుచికరంగా వంట చేయగలదా? రకరకాల బొమ్మలు చేయడం, చీరల మీద ఎంబ్రాయిడరీ వర్కు చేయడం కుదిరేదా? హడావిడిగా ఇంత వండుకోవడం, ఆఫీసుకి పరుగెట్టడం, సాయంత్రం అలిసిపోయి ఇంటికి రావడం. తిన్నానన్న పేరుకి ఏదో ఇంత వండుకుని తిని పడుకోవడం, సెలవురోజుల్లో మిగతా పనులు చేసుకోవడం, సరదాగా తిరగడం కానీ కబుర్లతో కాలక్షేపం చేయడం ఇవన్నీ అందని ద్రాక్షపళ్ళే అవుతాయి కదా. అదే ఇంటి పట్టున వుండి, భర్తకిష్టమైనవి వండి అతను ఆ వంటకాన్ని మెచ్చుకుంటూ తింటుంటే కలిగే సంతోషం, తృప్తి, ఉద్యోగం చేస్తూ సంపాదించే డబ్బు ఇస్తుందా? ఊహూ...డబ్బు వల్ల వస్తువులు అమర్చుకోగలదేమోకాని, మనసుకి ఆనందం, సంతృప్తి, ఉత్సాహం మాత్రం కరువైపోతాయి.

భర్త ఆఫీసునుండి వస్తూనే ''నీకో గుడ్ న్యూస్. మా ఫ్రెండు వాళ్ళ ఆఫీసులో ఓ లీవ్ వేకెన్సీ వుందట. అది నీకే వచ్చేలా చూస్తానని ప్రామిస్ చేసేడు'' అన్నాడు ఉత్సాహంగా.

''నాకు ఏ వేకెన్సీ వద్దులెండి'' అంది అనంతలక్ష్మి.

''అదేం! జాబ్ చేస్తానంటూ ఉబలాటపడ్డున్నావు కదా?''

''ఇదివరకు అనుకున్నాను ఉద్యోగం చేయాలని. ఇప్పుడు వద్దు అనుకుంటున్నాను. సాయంత్రం ఈ వీధిలో వుంటున్న పిల్లలు వచ్చి లెక్కలు, హిందీ, ఇంగ్లీషు చెప్పించుకుంటున్నారు. నాకు ఆ కాలక్షేపం చాల్లెండి. నా బదులు ఒక నిరుద్యోగికి ఆ జాబ్ వచ్చేటట్లు చేయండి చాలు'' నిజాయితీగా చెప్పిందామె.

''మనస్ఫూర్తిగా చెప్తున్నావా లేక నాకు ఇష్టం లేదని నీ కోరిక మార్చుకున్నావా?'' అతను భార్యవైపు అపనమ్మకంగా చూసేడు.

''నిజమే చెప్తున్నానండి. నాకు గృహిణిగా ఇల్లు దిద్దుకునే ఉద్యోగం చాలు. మరే ఉద్యోగమూ వద్దు'' మనస్ఫూర్తిగా చెప్పింది అనంతలక్ష్మి.

'అమ్మయ్య నా ప్రయోగం వృధా కాలేదు. నా సమస్య ఇంత త్వరగా తీరినందుకు ఆ శారదగారికి రేపే ధన్యవాదాలు చెప్పాలి' మనసులోనే ఎదురింటి శారదకు ధన్యవాదాలు చెప్పుకున్నాడు భర్త.

ఆవిడ, తన భర్త పనిచేసే ఆఫీసులోనే పని చేస్తున్నదని, తన మనసు మార్చడానికి భర్తే ఆమెతో అలా చెప్పించాడని పాపం అనంతలక్ష్మికి తెలిసే అవకాశమే లేదు. కానీ ఆమె నిర్ణయం వలన ఓ నిరుద్యోగికి ఉద్యోగం దొరకవచ్చుకదా! ఏమంటారు? ☆